సాక్షి పెద్దపల్లి

గురువారం ‌। 12 ‌। జూన్ ‌। 2025



రామాలయంలో వేడుకలు

ఓదెల: ఏరువాక పౌర్ణమి సందర్భంగా స్థానిక రామాలయంలో బుధవారం గోవృషభ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రైతులు, నాయకులు గోవుల పాదాలు కడిగి పూజలు చేశారు.



గొర్రెలకాపరులకు పరిహారం అందిస్తాం

ధర్మారం: విద్యుదాఘాతంతో మృత్యువాతపడిన గొర్రెలకు పరిహారం అందిస్తామని రాష్ట్ర జీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత కాస్త తగ్గే అవకాశం ఉంది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

సెలవులకు టాటా

- ఇక బడిబాట
- నేటి నుంచి స్కూళ్ల నిర్వహణ
- ముస్తాబైన సర్కారు పాఠశాలలు
- తొలిరోజే పుస్తకాలు, యూనిఫాంలు

జిల్లా సమాచారం

ప్రభుత్వ పాఠశాలలు	545
విద్యార్థుల సంఖ్య(సుమారు)	30,000
కొత్త ప్రవేశాలు	3,000
ప్రైవేట్ పాఠశాలలు	174
విద్యార్థుల సంఖ్య(సుమారు)	60,000
మూతపడిన సర్కార్ స్కూళ్లు	29



కమాన్‌పూర్ మండలంలోని సిద్దపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

సాక్షి, పెద్దపల్లి: ఆటాపాటలతో వేసవి సెలవులు సరదాగా గడిచిపోయాయి. ఉల్లాసంగా, ఉత్సాహంగా ఎగిరి గంతులేసిన విద్యార్థులు గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. సుమారు నెలన్నరపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది లేక బోసిపోయి కనిపించిన పాఠశాలలు మళ్లీ కళకళలాడనున్నాయి. మరోవైపు.. ఇళ్లనుంచి సంతోషంగా వచ్చే విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికేందుకు కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వాగత ఏర్పాట్లు చేశారు. అయితే, చాలాచోట్ల మౌలిక వసతుల లేమి చిన్నారులను పలకరించేందుకు సిద్ధంగా ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనపై అధికార యంత్రాంగం చెప్పిన మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల పథకాల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టినా.. చాలాచోట్ల అసంపూర్తిగానే మిగిలిపోయాయి. సర్కారు స్కూళ్లలో ప్రవేశాలు పెంచేందుకు ప్రభుత్వం ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. షెడ్యూల్ ప్రకారం అధికారులు వివిధ కార్యక్రమాలు చేపట్టి సర్కార్ స్కూళ్ల ప్రాధాన్యత గురించి తల్లిదండ్రులు, విద్యార్థులకు వివరించారు. ఇప్పటి వరకు సుమారు 3 వేలకుపైగా కొత్తగా ప్రవేశాలు కల్పించినట్లు అధికారులు వివరించారు.



పెద్దకల్వల ప్రభుత్వ పాథమికోన్నత పాఠశాల

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు–మన బడి పథకం కింద ఎంపిక చేసిన 191 ప్రభుత్వ పాఠశాలల్లో పనులు పడకేశాయి. ప్రస్తుతం ఎంపిక చేసిన 418 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో రూ.23.62కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించగా ఇప్పటివరకు రూ11.84కోట్లతో ప్రగతి పనులు పూర్తిచేశారు. విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించగా, మిగతా పనులన్నీ పురోగతిలో ఉన్నాయి.

పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీకి సిద్ధం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2,22,840 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, ఇప్పటివరకు సుమారు 2లక్షలకుపైగా పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకోగా.. మండల కేంద్రాలు.. అక్కడ నుంచి పాఠశాలలకు పంపించారు. మహిళా సంఘాలు జూన్ 10లోగా యూనిఫామ్స్‌ను కుట్టి ఉపాధ్యాయులకు అప్పగించేలా అధికారులు చర్యలు చేపట్టారు. మొత్తం 30 వేల యూనిఫామ్స్ కుట్టడం పూర్తయింది. పాఠ్య, నోట్‌పుస్తకాలే కాకుండా యూనిఫామ్స్‌ను కూడా తొలిరోజే విద్యార్థులకు అందించనున్నారు. జిల్లాలో 2,220 ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా, 2,195 మంది టీచర్లు పనిచేస్తున్నారు.

పండుగ వాతావరణం



పాఠశాలలను పండుగ వాతావరణంలో పునఃప్రారంభిస్తున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నిసౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకున్నాం. పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు, నోట్‌బుక్స్‌లు పాఠశాలలకు చేరవేశాం. బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు చేరవద్దు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలి.

– మాధవి, డీఈవో

తొలిరోజు తీపిగురుతులెన్నో..

- బడి.. ఓ మధుర జ్ఞాపకం
- చదువుతోనే భవిష్యత్ అంటున్న ఉన్నతాధికారులు
- పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో ప్రముఖుల బాల్యస్మృతులు



సాక్షి, పెద్దపల్లి/గోదావరిఖని: బాల్యం అంటే బడి.. పాఠశాలకు తొలిఅడుగు.. జీవితంలో మరిచిపోలేని మధుర క్షణం.. ఎప్పటికీ గుర్తుండిపోయే తీపిజ్ఞాపకం.. వేసవి సెలవుల్లో అనేక వ్యాపకాల్లో మునిగితేలిన పిల్లలు.. బడిగంట మోగగానే స్కూల్‌కు వెళ్లడానికి కాస్త బెరుకుగానే ఉంటారు. దీనిని 'స్కూల్ ఫోబియా' అంటారు. దీన్నుంచి వారిని బయట పడేయాలనే సంకల్పంతో తమ చిన్ననాటి బడి స్మృతులను 'సాక్షి'తో పంచుకున్నారు పలువురు ప్రముఖులు. చిన్ననాటి అనుభవాలనూ వారు గుర్తు చేసుకున్నారు. వారి మాటల్లోనే..

అమ్మతో కలిసి పోయేది

– కోయ శ్రీహర్ష, కలెక్టర్



మా అమ్మానాన్న కోయ సులోచన –నాగేశ్వరరావు ప్రభుత్వ ఉపాధ్యాయులు. వేసవి సెలవులు పూర్తయ్యాక అందిరిలాగే అమ్మ పనిచేసే ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల సర్కారు బడికి తొలిరోజు నుంచే పోయేవాడిని. అక్కడే ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదివా. మొదటిరోజు ఫ్రెండ్స్‌తో ఆటాపాటలతో గడిచిపోయింది. జీవితంలో పైకిరావడానికి బుడిబుడిఅడుగులు అక్కడే పడ్డాయి. ప్రైవేట్ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య దొరుకుతుందని అనుకోవడం పొరపాటు. ప్రభుత్వ పాఠశాలల్లో గతంకంటే మౌలిక వసతులు పెరిగాయి. విద్యతోపాటు సామాజికాంశాలు, ఆటలు, ఇతర అంశాలపై పట్టుసాధించేందుకు అవకాశం ఉంటుంది. 'బడీడు' పిల్లలందరూ బడిలో ఉండాలి. ప్రతీఒక్కరు చదువుకోవాలి. కష్టపడి చదువుకుంటేనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు. నేను చిన్నప్పటి నుంచి కష్టపడి చదివా. లక్ష్యం సాధించా.

సంచులే బ్యాగ్‌లు

– కరుణాకర్, డీసీపీ, పెద్దపల్లి



నా విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లోనే పూర్తయ్యింది. నాన్న స్కూల్‌లో జాయిన్ చేస్తే.. నాకంటే ఒక్క క్లాస్ పెద్దయిన మా బ్రదర్‌తో కలిసి నడుచుకుంటూ పోయేవాడిని. ఎనిమిదో తరగతి వరకు ఉప్పల్, తొమ్మిదో తరగతి హుజూరాబాద్, పదో వతరగతి మళ్లీ ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలోనే చదివా. బియ్యపు సంచులను బ్యాగ్‌లుగా తయారుచేసి కుట్టిస్తే, వాటిని భుజానికి వేసుకుని స్కూల్‌కు పోయేవాళ్లం. తొలిరోజు స్కూల్‌కి పోయినప్పుడు వర్షం పడేది. అప్పుడు పుస్తకాలు తడవకుండా షర్ట్ జేబులో దాచుకునేవాడిని. చిన్నారులను సర్కారు బడికే పంపించాలి. వారిపై ఖర్చుచేసే డబ్బు ఆదా చేస్తే భవిష్యత్‌లో ఎంతోఉపయోగపడుతుంది. చదువుపై ఆసక్తి ఉంటే సర్కారు బడిలో చదివినా ఉన్నతంగా ఎదగవచ్చు. ప్రతీఒక్కరికి పసిప్రాయంలో అనేక అనుభూతులు ఉంటాయి. నాకు అలాగే ఉన్నాయి. అప్పటిరోజులు గోల్డెన్ డేస్.

ప్రమోషన్ వచ్చినంత సంతోషం



స్కూళ్లు ప్రారంభం అవుతున్నాయని తెలియగానే చాలా సంతోషంగా ఉండేది. పైతరగతికి వెళ్తున్నామంటే ఇప్పుడు ప్రమోషన్ వచ్చినంత ఆనందంగా ఉండేది. పుస్తకాలు, కాపీలు, పెన్నులు, పెన్సిళ్లు ముందే సిద్ధం చేసుకుని కిలోమీటరు దూరంలో ఉన్న స్కూల్‌కు నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. పుస్తకాలకు అట్టలు వేసుకుని ఫ్రెండ్స్‌తో కలిసి ఉత్సాహంగా బడిబాట పట్టాం.

– లలిత్‌కుమార్, ఆర్జీ–1 జీఎం

గోడకుర్చీ.. చెంపదెబ్బలు



స్కూల్ జీవితమంతా ఆనందంగా సాగింది. మా నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో ఆయన వెంటే స్కూల్‌కు వెళ్లేవాళ్లం. అన్న పాతపుస్తకాలు తీసుకుని కొత్తఅట్టలు వేసుకుని అందంగా ముస్తాబు చేసేవాళ్లం. చదువురాని అబ్బాయిలకు అమ్మాయిలతో చెంపదెబ్బలు కొట్టించేవాళ్లు. సార్ గోడకుర్చీ వేయించేవారు. ప్రతీరోజు లాస్ట్ పీరియడ్ ఆటల కోసం కేటాయించే వాళ్లం. ఏదిఏమైనా ఆరోజులే వేరు.

– నాగేశ్వర్‌రావు, ఏపీఏ జీఎం

ఆ రోజులే వేరు

– బండి వెంకటయ్య, ఆర్జీ–2 జీఎం



చిన్ననాటి రోజుల్లో చదవులే వేరు. స్కూల్‌లో సార్ మాట వేదవాక్కు. చాలా క్రమశిక్షణగా చదువు ముందుకు సాగేది. ఫ్రెండ్స్‌తో ఆడిపాడి ఆనందంగా గడిపేవాళ్లం. అప్పటిచదువులు, గురువు అంటే గౌరవం ఇప్పుడు లేదు. కష్టపడి చదువుకుని ఈస్థాయికి ఎదగాం.

న్యూస్‌రీల్

భూసమస్యల పరిష్కారానికే..



మాట్లాడుతున్న మంథని ఆర్డీవో సురేశ్

కమాన్‌పూర్(మంథని): భూసమస్యల పరిష్కారానికే భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మంథని ఆర్డీవో సురేశ్ అన్నారు. రాజాపూర్‌లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. దరఖాస్తులను పరిశీలించి విచారణ జరిపి భూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దార్ వాసంతి, ఆర్ఐ స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ సతీశ్, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, రజిత, కుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేయాలి



చిన్నారికి టీకా వేస్తున్న డీఎంహెచ్‌వో

పెద్దపల్లిరూరల్: శిశువులకు రోటాసిల్ టీకాలు వేయాలని డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి సూచించారు. రెండు డోసులు కలిగిన రోటా సిల్ టీకా వాయిల్‌ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. 6 వారాల వయసుగల శిశువుకు ఓపీవీ పెంటా వాలెంట్ తొలిడోసుతోపాటు ఇవ్వాలన్నారు. వైరస్ సోకిన పిల్లల్లో తీవ్రనీళ్ల విరోచనాలు, జ్వరం, వాంతులు, కడుపునొప్పి ఉంటాయని, విరోచనాలు అధికమైతే మృతి చెందవచ్చని, అందుకే రోటాసిల్ టీకాలు తప్పనిసరి వేయించాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ కిరణ్‌కుమార్, స్వాతిభాను, అఖిల ఉన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

మంథని: స్థానిక మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో స్త్రీవైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, మహిళలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి కోరారు. గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యులు, సిబ్బందితో స్థానిక ఆస్పత్రిలో ఆమె వైద్యసేవలపై సమీక్షించారు. సర్కారు ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సృజన్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సుల ఫిట్నెస్ రెన్యూవల్ చేయించాలి



రంగారావు

జ్యోతినగర్(రామగుండం): జిల్లాలోని పాఠశాలల బస్సుల ఫిట్నెస్ రెన్యూవల్ చేసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావు సూచించారు. ఈ నెల 12న పాఠశాలలు, ఇతర విద్యాసంస్థలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో యాజమాన్యులు తమ స్కూల్ బస్సులు, ఇతర వాహనాల ఫిట్నెస్ (వాహన సామర్థ్య పరీక్ష) రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. స్కూల్ బస్సులు నిబంధనలు పాటించాలని ఆయన పేర్కొన్నారు.

18న కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని నిరుద్యోగులకు వీవీసీ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 18న కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు బుధవారం తెలిపారు. రూమ్ నంబర్–225లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో చేపట్టే మేళాలో 60 ఈవీ సర్వీస్ టెక్నీషియన్, ఆటోమేటివ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు భర్తీచేస్తారన్నారు. పదో తరగతి, ఐటీఐ/డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్హులని, 18–30ఏళ్ల వయసులోపు ఉండాలని తెలిపారు. నెల వేతనం రూ.12 నుంచి రూ.15 వేల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 18న ఉదయం 11 గంటల సర్టిఫికెట్ జిరాక్స్‌లతో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 77299 92061 నంబరులో సంప్రదించాలని సూచించారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు

పెద్దపల్లిరూరల్: హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సురేశ్ తెలిపారు. నాలుగో తరగతి చదివే బాల, బాలికలు 1 సెప్టెంబర్ 2016 నుంచి 31 ఆగస్టు 2017 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. వీరికి మండల స్థాయిలో ఈనెల 16–19 తేదీలు, జిల్లాస్థాయిలో ఈనెల 23–25వ తేదీల మధ్య ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థుల కోసం రాష్ట్రస్థాయిలో ఈనెల జూలై 1 నుంచి 5వ తేదీ వరకు హకీంపేటలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆధార్ జిరాక్స్, బోనోఫైడ్ (నాలుగో తరగతి), మూడో తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, పుట్టిన తేదీ, కులం ధ్రువీకరణ పత్రాలతో tgss.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

20న గిరిజన గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గిరిజన గ్రామాల్లో ఈనెల 20న ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. పీఎం జన్‌మాన్, డీఏజేజీయూఏ పథకాల నిర్వహణపై కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మాన్ (ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ్ మహా అభియాన్), డీఏజేజీయూఏ(ధరతి ఆభా జనజాతి గ్రామ ఉత్కర్ష అభియాన్) కార్యక్రమాలను చేపట్టిందన్నారు. గిరిజనులు అధికంగా ఉన్న బట్టుపల్లిని ఇందుకు ఎంపిక చేసుకున్నామని, గ్రామస్తులందరికీ తప్పనిసరిగా ఆధార్, ఆయుష్మాన్, రేషన్, కిసాన్‌కార్డులతోపాటు కులధ్రువీకరణ పత్రాలు జారీచేయాలని, అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఇందుకోసం మీసేవ సెంటర్‌తో సహా మిగతా అన్ని గిరిజన గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని, అర్హులతో దరఖాస్తు చేయించాలని సూచించారు. దివ్యాంగులకు యూడీఐడీ వచ్చేలా చూడాలన్నారు. జన్‌ధన్ యోజన బ్యాంకు ఖాతాలు తెరవాలని, పీఎం విశ్వకర్మ, ముద్ర, స్టాండప్ ఇండియా వంటి పథకాల ద్వారా స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు రుణాలు మంజూరు చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు. పోడు భూములకు పట్టాలు జారీచేసిన లబ్ధిదారులతో కూడా సమావేశం ఏర్పాటు చేసి వారికి ఇందిరా గిరిసౌర జల వికాసంపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో మంథని ఆర్డీవో సురేశ్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి సంగీత, డీఎఫ్‌వో శివయ్య, డీహెచ్‌ఎంవో అన్న ప్రసన్నకుమారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.

ఆక్షేపణలు.. ఆరోపణలు

- ముగిసిన అభ్యంతరాల స్వీకరణ
- నేటినుంచి ఐదు రోజులపాటు పరిశీలన, విచారణ
- ఈనెల 21న తుది నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు



బల్దియా ఎదుట నిరసన తెలుపుతున్న అల్లూరు గ్రామస్తులు(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం బల్దియాలో స్తబ్దుగా ఉన్న రాజకీయం.. డివిజన్ల పునర్విభజనతో ఒక్కసారిగా అలజడి రేగింది. ఈనెల 3న నగరాన్ని 60 డివిజన్లుగా విభజిస్తూ ఈ నెల 4న ముసాయిదా జాబితా వెల్లడించడం ఇందుకు కారణమైంది. క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సిన అధికారులు.. రెండ్రోజులపాటు గదుల్లో కూర్చొని ఓటర్ల జాబితా ఆధారంగా ముసాయిదా రూపొందించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే, అభ్యంతరాలు, సలహాలు, సూచనల స్వీకరణకు ఇచ్చిన గడువు బుధవారం ముగిసింది. ఈనెల 21న తుది నోటిఫికేషన్ విడుదల చేయడానికి కసరత్తు చేస్తున్నారు. పునర్విభజన పారదర్శకంగా లేదని ఆరోపణలు వస్తుండగా, డివిజన్ల హద్దులు మరోసారి మారే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

10 శాతం ఓటర్ల వ్యత్యాసం

బల్దియాను 50 నుంచి 60 డివిజన్లుగా మార్పుచేయడానికి 10 శాతం ఓటర్ల వ్యత్యాసం ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికనుగుణంగా ఒక్కో డివిజన్లో 2,700 మంది నుంచి 3,300 మంది ఓటర్లుగా ఉండేలా ముసాయిదా తయారు చేశారు. అభ్యంతరాలపై ఈనెల 16వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తుది జాబితా రూపొందించనున్నారు. మ్యాపులు, హద్దుల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు.. ముసాయిదా జాబితాపై గడువు ముగిసే బుధవారం నాటికి 63 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు.

హద్దుల మార్పుతో అయోమయం..

డివిజన్ల పునర్విభజనతో హద్దులు మారడంతో కార్పొరేటర్లుగా పోటీచేయాలనుకుంటున్న వారిలో అయోమయం నెలకొంది. తమకు అనుకూలంగా ఉండే ఓటర్లు, మరో డివిజన్లలోకి మారడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఇవీ అభ్యంతరాలు..

- అల్లూరు గ్రామస్తులు ఈనెల 9న బల్దియా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. శ్రీపాదనగర్‌ను తమ గ్రామంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. బల్దియాలో విలీనమైన వెంకట్రావుపల్లిని రాజీవ్‌నగర్‌లో కలుపకుండా ప్రత్యేక డివిజన్‌గానే గుర్తించాలని, మారేడుపాకలో వీర్లపల్లి ప్రాంతాన్ని కలపకుండా ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించారు.
- ఎన్టీపీసీ భీమునిపట్నం కాలనీలో కొంతభాగాన్ని నాలుగు, మరికొంత ఐదో డివిజన్‌లో చేర్చారు. భీమునిపట్నంకాలనీని ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
- గాంధీనగర్, గంగానగర్, శ్రీరాంనగర్, చంద్రబాబుకాలనీ, శారదానగర్, హనుమాన్‌నగర్‌లో ఒకేబ్లాక్ ఇంటి నంబర్ల ఆధారంగా డివిజన్లు ఏర్పాటు చేయడంతో నైసర్గిక స్వరూపం మారిపోతోందని, క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ చేయాలని స్థానికులు దరఖాస్తు చేశారు.
- సంజయ్‌గాంధీనగర్, రాజీవ్‌నగర్, ఇందిరానగర్‌లోని ఇళ్లన్నంటినీ ఒకే డివిజన్‌గా మార్పు చేయాలని విన్నవించారు.
- గతంలో 33వ డివిజన్‌గా ఉన్న పరుశురామ్‌నగర్, ఫైవింక్లయిన్ ఏరియాలో 3,200 ఓట్లు ఉండగా, ప్రస్తుతం పరుశురామ్‌నగర్‌కు సంబంధం లేని తిలక్‌నగర్, విఠల్‌నగర్ ఓట్లను చేర్చి ప్రత్యేక డివిజన్‌గా మార్చారని, దీనివల్ల దళితుల ఓట్లు చెల్లాచెదురుగా మారి రిజర్వేషన్ కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన చెందారు.

21న తుది నోటిఫికేషన్



రామగుండం నగరంలో డివిజన్ల పునర్విభజన ముసాయిదాపై ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం. దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సర్వే చేయిస్తాం. డివిజన్ల మధ్య 10 శాతం వేరియేషన్ ఉండేలా ఓటర్లను 60 డివిజన్లకు కేటాయిస్తాం. డివిజన్ల హద్దులు, మ్యాపులు సిద్ధం చేసి ఈనెల 17, 18న కలెక్టర్, 19న సీడీఎంఏకు నివేదిస్తాం. ఈనెల 21న తుది నోటిఫికేషన్ విడుదల చేస్తాం.

– అరుణశ్రీ, రామగుండం బల్దియా కమిషనర్(ఎఫ్ఏసీ)

గందరగోళంగా ఉంది



డివిజన్ల పునర్విభజన గందరగోళంగా ఉంది. పారదర్శత లేదు. హడావుడిగా, తప్పుల తడకగా, మొక్కుబడిగా పునర్విభజన చేశారు. ఓటరు జాబితా పొంతన లేకుండా ఉంది. దళిత సామాజిక రిజర్వేషన్లకు భంగం కలిగిస్తే హైకోర్టును ఆశ్రయిస్తాయిం. మా డివిజన్‌కు చెందిన ఓటర్లను సంబంధంలేని డివిజన్‌లో చేర్చారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు, అభివృద్ధికి అనుకూలంగా విభజన చేయాలి.

– మద్దెల దినేశ్, గోదావరిఖని

డివిజన్ల పునర్విభజనపై సమీక్ష

నగరంలో చేపట్టిన డివిజన్ల పునర్విభజన తీరును వరంగల్ పురపాలక శాఖ రీజినల్ డైరెక్టర్ షాహీద్ మసూద్ బుధవారం పరిశీలించారు. స్పెషలాఫీసర్‌గా వ్యవహరిస్తున్న షాహీద్ మసూద్.. కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీతో భేటీ అయ్యారు. డివిజన్లపై వస్తున్న ఆక్షేపణలు, సలహాలు, సూచనలపై ఆరా తీశారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులతోనూ సమావేశమయ్యారు. విభజన పురోగతిపై సమీక్షించారు. మ్యాపులను టీపీవో నవీన్ వివరించారు. పొరపాట్లకు తావివ్వకుండా డివిజన్ల హద్దులు నిర్ణయించాలని ఆయన సూచించారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే విజయరమణారావు



పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల(పెద్దపల్లి): పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కనగర్తిలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతీ మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రాన్ని అనుసంధానిస్తూ డబుల్ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, మాజీవైస్ ఎంపీపీ పిట్టల కుమార్, ఎంపీడీవో తిరుపతి, మాజీ ఎంపీటీసీ చొప్పరి రాజయ్య, నాయకులు ఉడిగే సదయ్య, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగనాథుని సన్నిధిలో పూజలు

పెద్దపల్లిరూరల్: బొంపల్లి శ్రీభూగోదా సమేత రంగనాథస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే విజయరమణారావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాటపై ప్రత్యేక శ్రద్ధ

- 17 వరకు ఇంటింటి ప్రచారం



చిన్నారులతో డీడబ్ల్యూవో వేణుగోపాల్

సుల్తానాబాద్(పెద్దపల్లి): రామగుండం, పెద్దపల్లి, మంథని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో సుమారు 706 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో గర్భిణులు 3,471 మంది, ఆర్నెల్ల వయసుగల చిన్నారులు 2,414 మంది, మూడేళ్ల వయసుగల వారు 17,340 మంది, ఆరేళ్ల వయసుగలవారు 15,834 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట పేరిట ఇంటింటా పర్యటించేందుకు అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మూడేళ్ల వయసుగల చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించారు. అదేవిధంగా ఐదేళ్ల వయసు పైబడిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నా రు. వీటితోపాటు ఈనెల 17వ తేదీ వరకు అంగన్‌వాడీ ప్రాంగణాల్లో కిచెన్ గార్డెన్లు అభివృద్ధి చేయాలి. కూరగాయల మొక్కలు పెంచాలి. హాట్ కుక్ డ్ మీల్స్ ద్వారా పోషకాహారం అందించాలి. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయాలి. ఆటాపాటలు, బొమ్మల ద్వారా చదువు చెబుతున్నామని ప్రచారం చేయాలి.

ఆటాపాటలతో చదువు

ప్రభుత్వం ఈసారి అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించింది. ఈమేరకు ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు అంగన్‌వాడీ టీచర్లు వివిధ కార్యక్రమాలు చేపడతారు. బొమ్మలు, వస్తువులతో ఆటాపాటల ద్వారా చిన్నారులకు చదువు చెబుతారు.

– వేణుగోపాల్, డీడబ్ల్యూవో, పెద్దపల్లి

క్లుప్తంగా

కుక్కల దాడిలో గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల గ్రామంలో బుధవారం పిచ్చికుక్కల దాడిలో బొట్కు మహేశ యాదవ్‌కు చెందిన 20 గొర్రెలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈసంఘటనలో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటినట్లు బాధితుడు మహేశ్ బావురుమన్నాడు. గ్రామంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని కుక్కల బెడద తప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

మడేలేశ్వరస్వామి ఆలయంలో చోరీ

- 15 గ్రాముల బంగారం చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని మంచినీళ్ల బావి వద్దగల మడేలేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. పూజ అనంతరం అర్చకులు ఆలయానికి తాళం వేసి వెళ్లారు. గుర్తుతెలియని దొంగలు చొరబడి 15 గ్రాముల బంగారం, హుండీలో కొంత నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం అర్చకులు వెళ్లి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ ఎస్సై మన్మథరావు సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

భూవివాదంలో ఒకరి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న నాగేశ్వరవరప్రసాద్

మెట్‌పల్లిరూరల్: తాను కొనుగోలు చేసిన భూమిని ఇతరులకు విక్రయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. కోరుట్లకు చెందిన వనతడుపుల నాగేశ్వరవరప్రసాద్ కొన్నేళ్ల క్రితం చౌలమద్ది శివారులోగల భూమి కొన్నాడు. డబ్బులు చెల్లించినా.. ఆ భూమిని ఓ కుల సంఘం పెద్దమనుషులు తనకు కాకుండా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించారు. తన డబ్బులు తనకు ఇవ్వాలని అడిగినా ఇవ్వకపోవడంతో విసుగు చెందిన నాగేశ్వరవరప్రసాద్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతడిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి వద్ద ఓ నోట్ లభ్యమైంది. మెట్‌పల్లి సీఐ అనిల్, ఎస్సై కిరణ్‌కుమార్ బాధితుడి నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఆస్పత్రుల్లో అప్రమత్తం

- భద్రతా చర్యలపై నిరంతర నిఘా
- సీసీ కెమెరాల ఏర్పాటు, పర్యవేక్షణ తప్పనిసరి
- అనుమానిత వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించండి
- గోదావరిఖని ఏసీపీ రమేశ్
- జీజీహెచ్, సింగరేణి ఆస్పత్రుల తనిఖీ


గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న ఏసీపీ రమేశ్, పోలీసు అధికారులు

గోదావరిఖని/కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)తోపాటు సింగరేణి ఏరియా ఆస్పత్రిలో భద్రతా చర్యలపై అప్రమత్తంగా ఉండాలని ఆస్పత్రి అధికారులను ఏసీపీ రమేశ్ కోరారు. రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు బుధవారం వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డితో కలిసి ఏసీపీ జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. వైద్య సిబ్బందిపై దాడులు, ఆస్పత్రుల నుంచి పిల్లల కిడ్నాప్ తదితర ఘటనలపై ఆస్పత్రి అధికారులతో చర్చించారు. మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్‌తో భేటీ అయ్యారు. వైద్యం కోసం వచ్చే అనుమానస్పద వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు చేరవేయాలన్నారు. ఆస్పత్రుల్లో అనూహ్య ఘటనలు జరిగితే వైద్యులు, సిబ్బంది, ఆస్పత్రులపై బంధువులు, కుటుంబ సభ్యులు దాడులకు పాల్పడే అవకాశం ఉంటుందని, ముందస్తు భద్రత, రక్షణ కోసం ఆస్పత్రి ముఖద్వారం, ఎగ్జిట్ డోర్, ఆస్పత్రి మెయిన్ రోడ్లు, ఎమర్జెన్సీ, చిల్డ్రన్స్, మెటర్నటీ, క్యాజువాలిటీ వార్డ్ తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తరచూ వాటిని పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, పోలీస్ సిబ్బంది, డాక్టర్లు, జీజీహెచ్ ఆర్ఎంవో రేణుకతోపాటు పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో అధికారుల విచారణ

- రంగంలోకి దిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్, రెవెన్యూ శాఖలు


రైస్‌మిల్లులోధాన్యం నిల్వలపై ఆరా తీస్తున్న అధికారులు

మంథని: సూరయ్యపల్లి గ్రామంలోని ఓ రైస్ మిల్లులో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మళ్లీ విచారణ చేపట్టారు. 2022–23, 2023–24 సంవత్సరాల్లో రైస్ మిల్లుకు పౌర సరఫరాల శాఖ ద్వారా కేటాయించిన ధాన్యం నిల్వలపై గత మార్చి 28న టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తొలుత తనిఖీలు చేసిన అధికారులు.. గంగాపురిలోని మరోరైస్ మిల్లు గోదాంలో నిల్వ చేసిన ధాన్యం తనిఖీ చేశారు, అయితే రెండు సంవత్సరాలకు సంబంధించి 41,365 క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉండాల్సి ఉండగా కేవలం 9,689 క్వింటాళ్లు మాత్రమే నిల్వ ఉన్నట్లు గుర్తించారు. మిగతా ధాన్యం స్వాహా చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ నివేదికను సదరు అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. ఆ నివేదికను తప్పుపడుతూ సదరు రైస్ మిల్లు యజమాని కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు తిరిగి ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లై, రెవెన్యూ శాఖ అధికారుల మళ్లీ ఎంకర్వీ చేశారు. తొలుత ఇక్కడి రైస్ మిల్లులో తనిఖీలు చేసిన అనంతరం గంగాపురిలోని గోదాంలో ధాన్యం నిల్వలను తనిఖీ చేశారు. విచారణ నివేదికలను కోర్టుకు సమర్పిస్తామని అధికారులు తెలిపారు.

బీజేపీని విమర్శించే అర్హత కాంగ్రెస్‌కు లేదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

- సిర్పూరు బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

సాక్షి, పెద్దపల్లి: ఆచరణ సాధ్యంకాని ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ప్రజలను నిలువునా మోసం చేసిందని, ఆ పార్టీకి బీజేపీని విమర్శించే అర్హతలేదని సిర్పూరు బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు విమర్శించారు. నరేంద్రమోదీ 11ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా 70రోజుల పాటు వికసిత్ భారత్ పేరిట కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవితో కలిసి హరీశ్‌బాబు మాట్లాడారు. మోదీ 11ఏళ్ల పాలననలో చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించేలా సంకల్ప సహకారం కార్యక్రమం రూపొందించామన్నారు. ప్రధాని సాహసోపేత నిర్ణయాలతో భారత్ ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. ఆపరేషన్ సిందూరుతో శక్తివంతమైన దేశంగా నిలిచిందని, పూర్తిస్వదేశీ పరిజ్ఞానంతో ఫైటర్ జెట్లను తయారు చేసుకునే స్థాయికి ఎదిగిందన్నారు. మోదీ బటన్ నొక్కితే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు పడుతుందని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బటన్ నొక్కితే రైతుల బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయని ఎద్దేవా చేశారు. ఎవరూ ఊహించని విధంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని, దీనితో రాబోయే రోజుల్లో ప్రతీ ముగ్గురు ఎంపీ, ఎమ్మెల్యేల్లో ఒక మహిళను చూడబోతున్నామని అన్నారు. సమ్మక్క – సారలమ్మ యూనివర్సిటీ, పసుపు బోర్డు ఏర్పాటు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం, రైల్వే, రోడ్ల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించడం మోదీ పాలనకు రెఫరెండమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై పట్టు కోల్పోయారని, ఆర్నెల్లలో 50సార్లు ఢిల్లీకి వెళ్లినా రాహుల్‌గాంధీ అపాయింటుమెంటు ఇవ్వడంలేదని సెటైర్ వేశారు. బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత కాంగ్రెసుకు లేదని, తెలంగాణలో డబల్ ఇంజన్ సర్కారు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో నాయకులు కందుల సంధ్యారాణి, పల్లె సదానందం, జంగ చక్రధర్‌రెడ్డి, అక్కపల్లి క్రాంతికుమార్, బెజ్జంకి దిలీప్‌కుమార్, భూషణవేణి శ్రీనివాస్, కంకణాల జ్యోతిబసు, రేవెల్లి సందీప్, చాతరాజు రమేశ్, కడారి అశోక్‌రావు, సొదారి మహేందర్, రాజ్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

జమ్మికుంటలో బైక్‌చోరీ

జమ్మికుంట: పట్టణంలో ఓ వ్యక్తి బైక్ చోరీకి గురైంది. టౌన్ సీఐ ఎస్.రామకృష్ణ వివరాల ప్రకారం.. జమ్మికుంట పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన గడ్డం రాజేందర్ మంగళవారం కూరగాయాల అంగడికి వచ్చాడు. బైక్ పార్కింగ్ చేసి, కూరగాయలు తీసుకొచ్చేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా లాభం లేకుండా పోయింది. బైక్ విలువ రూ.30వేలు ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా చేస్తా

- 50 పడకల ఆసుపత్రి, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు నిర్మిస్తా
- విద్యార్థినుల ఉన్నత విద్యకు సదుపాయాలు
- ధర్మపురి పుణ్యక్షేత్ర అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సాక్షిప్రతినిధి,కరీంనగర్: తనకు రాజకీయ జన్మనిచ్చిన ధర్మపురిని నియోకవర్గాన్ని, ఇటీవల రోడ్డు ప్రమాదంలో పునర్జన్మనిచ్చిన ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి రుణాన్ని తాను ఏనాడూ తీర్చుకోలేనని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చిన ఆయన బుధవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

నియోజకవర్గపరంగా మీ ప్రాధాన్యాలేంటి?

అడ్లూరి: ధర్మపురి ప్రజలను, లక్ష్మీ నరసింహస్వామిని జీవితంలో మర్చిపోను. ప్రజలు ఎమ్మెల్యేగా జన్మనిస్తే.. రోడ్డు ప్రమాదంలో స్వామి నన్ను కాపాడి పునర్జన్మనిచ్చారు. ఎన్నికల్లో ఎన్నిసార్లు ఓడినా నా అనుచరులు నా కోసమే పనిచేశారు. వారిరుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది. మంత్రిగా నియోజకవర్గంలో సాగునీటికి తొలి ప్రాధాన్యం ఇస్తా. విద్య, వైద్యం, సదుపాయాలకు పెద్దపీట వేస్తా. ఇక్కడి విద్యార్థినులు డిగ్రీ, పీజీ కళాశాలలు లేక జగిత్యాల, కరీంనగర్ వెళ్తున్నారు. ధర్మపురిలో డిగ్రీ, పీజీ కళాశాలలతోపాటు ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యాసంస్థలు ఏర్పాటు చేయిస్తా. చారిత్రక ధర్మపురి పుణ్యక్షేత్రానికి చీకటిపడితే రవాణా సౌకర్యం లేదు. ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. 50పడకల ఆసుపత్రి నిర్మిస్తా. ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా మారుస్తా.

మంత్రిగా భవిష్యత్ ప్రణాళికలు?

అడ్లూరి: తొలిసారి ఎమ్మెల్యే, ఆపై విప్.. ఇప్పుడు మంత్రి పదవి. పార్టీలో సామాన్య కార్యకర్తలకు ప్రాధాన్యం ఉంటుందనడానికి నాకు దక్కిన పదవులే నిదర్శనం. మంత్రి అయ్యాక మరింత బాధ్యత పెరిగింది. నాకు ప్రభుత్వం కేటాయించిన ఏ శాఖ కేటాయించినా 100శాతం న్యాయం చేస్తా. ప్రజా ఆకాంక్షల మేరకు పనిచేస్తా. ప్రతీ 30రోజులకు నా శాఖలోని పనులపై సమీక్ష చేపడతా.

మీరు మంత్రి కావడంలో కుటుంబ పాత్ర?

అడ్లూరి: నా భార్య కాంతకుమారి ప్రభుత్వ లెక్చరర్. నా రాజకీయ జీవితంలో ఆమె పాత్ర చాలా కీలకం. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్థికంగా ఇబ్బందులున్నా.. తన ఉద్యోగాన్ని, కెరీర్‌ను త్యాగం చేసి నాకు అండగా నిలిచింది. 2018లో ఓడిన సమయంలో నాలో ధైర్యం నింపింది. నా పిల్లలు కూడా వెంట నిలిచారు. వారి సహకారం మాటల్లో వర్ణించలేనిది.

గొర్రెలకాపరులకు పరిహారం అందిస్తాం

- రాష్ట్రమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- గొర్రెల కాపరుల కుటుంబాలకు పరామర్శ


హమాలీ కుటుంబానికి చెక్కును అందిస్తున్న మంత్రి

ధర్మారం(ధర్మపురి): విద్యుత్ షాక్‌తో మరణించిన గొర్రెలకు పరిహారం అందిస్తామని, బాధితులు ఆందోళన చెందవద్దని బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ భరోసా ఇచ్చారు. చామనపల్లిలో ఇటీవల విద్యుదాఘాతంతో 52 గొర్రెలు మరణించగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి గొర్రెలకాపరులను పరామర్శించారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో ప్రమాదవశాత్తు లారీపై నుంచి కింద పడి మరణించిన హమాలీ మెడవేని రాజేశం భార్య రాజేశ్వరికి రూ.5లక్షల పరిహారం చెక్కు అందజేసి మాట్లాడారు. ఇచ్చిన మాటప్రకారం సింగిల్‌విండో ద్వారా రూ.3 లక్షలు, కలెక్టర్ ప్రత్యేక నిధి ద్వారా రూ.2లక్షలను బాధిత కుటుంబానికి అందించామన్నారు. చామనపల్లిలో మృత్యువాతపడ్డ ఒక్కో గొర్రెకు రూ.7వేల చొప్పున విద్యుత్ శాఖ ద్వారా పరిహారం మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ధర్మారం, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్‌పర్సన్లు రూప్లానాయక్, ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సంతోష్, డీసీవో శ్రీమాల, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ వైస్‌చైర్మన్ కాడే సూర్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అశోద అజయ్, నాయకులు ఓరం చిరంజీవి, ఎండీ అష్ఫు, ఎల్లయ్య, ఈదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక శిక్షణ.. భవిష్యత్తుకు నిచ్చెన

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- టైలరింగ్, డ్రాయింగ్, క్రాఫ్ట్, ఆర్ట్‌లలో 42 రోజులపాటు..
- పూర్తి చేసిన 89 మంది పురుషులు, 680 మంది మహిళలు


శిక్షణలో పాల్గొన్న మహిళలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): తమ చిన్ననాటి కలలను ఇప్పుడు సాకారం చేసుకుంటున్నామని కొందరు.. నేర్చుకుంటున్న కళను ఇంకా మెరుగుపర్చుకుందామని మరికొందరు.. స్కూల్‌లో పిల్లలకు పెట్టే టాస్క్‌లో మేము సైతం సాయం చేద్దామని ఇంకొందరు.. ఉపాధి కోసమని.. ఉద్యోగం సాధించాలని.. పది మందికి ఉపాధి కల్పించాలని ఇలా ఎవరికి వారు తమ ఆశయాలు, లక్ష్యం సార్థకం చేసుకునేందుకు సిద్ధమయ్యారు నారీమణులు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తూ కళలకు వయస్సుతో సంబంధం లేదని కరీంనగర్ మంకమ్మతోటలోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న సాంకేతిక ఉపాధ్యాయ శిక్షణ కోర్సు(టీటీసీసీ)లో ఉత్సాహంగా పాల్గొన్నారు మహిళలు. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సులో పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ పొందారు. 42 రోజులపాటు సాగిన కోర్సు బుధవారంతో పూర్తయింది. ఈక్రమంలో శిక్షణ పొందిన మహిళల అనుభవాలు, భవిష్యత్ కార్యాచరణపై సాక్షి ప్రత్యేక కథనం.

42 రోజుల శిక్షణ


డ్రాయింగ్, క్రాఫ్ట్ తదితర వాటిల్లో శిక్షణ పొందుతున్న మహిళలు

ధన్గర్‌వాడీ పాఠశాలలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సులో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కొమురంభీం, మంచిర్యాల, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల నుంచి 89 మంది పురుషులు, 680 మంది మహిళలు మొత్తం 769 మంది వివిధ కోర్సుల్లో శిక్షణ పొందారు. మే 1న కోర్సు ప్రారంభించగా.. జూన్ 11తో ముగిసింది. టైలరింగ్, డ్రాయింగ్, ఆర్ట్, క్రాఫ్ట్‌లలో 42 రోజులపాటు శిక్షణ పొందారు. 469 మంది డ్రాయింగ్‌లో, 360 మంది టైలరింగ్, క్రాఫ్ట్‌లలో శిక్షణ తీసుకున్నారు. శిక్షణ కోర్సు డైరెక్టర్ బొట్ల రామస్వామి పర్యవేక్షణలో టీటీసీసీ శిక్షణ కార్యక్రమాలు పకడ్బందీగా పూర్తయ్యాయి.

ఆర్ట్‌లో నైపుణ్యం సాధించా



ఎంటెక్ పూర్తి చేశా. ప్రస్తుతం జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా. ఆర్ట్, డ్రాయింగ్ అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. కోర్సులో భాగంగా చాలా రకాల వాటిని తయారు చేశా. కలెక్టర్ కూడా ఇంప్రెస్ అయ్యారు.
– హెచ్.రోజా, కరీంనగర్

క్రాఫ్ట్ వర్క్ నేర్చుకున్నా



కరీంనగర్‌లో జరిగిన టీటీసీసీలో ప్రతిరోజు క్లాసులకు హాజరయ్యా. క్రాఫ్ట్ వర్క్ బాగా నేర్చుకున్నా. పూల బుట్టి, ఆకులతో పలు రకాల వస్తువులు తయారు చేశా. బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశా. ఇలాంటి కోర్సులు మాకు ఉపాధినిచ్చే విధంగా ఉన్నాయి. ప్రతీ ఒక్కరు కోర్సు చేయాలి.
– ఎల్.లక్ష్మి, ఇందారం, మంచిర్యాల

టైలరింగ్‌లో శిక్షణ



బీకామ్ డిగ్రీ చేశా. గతంలో శిశు గృహ తదితర సంస్థల్లో పని చేశా. కోర్సు పూర్తి చేసి స్కూళ్లలో చిన్నారులకు నేర్పించాలనుకుంటున్నా. టైలరింగ్‌లో అల్లికలు తదితర వాటిని బాగా నేర్చుకున్నా. ట్రైనర్స్ బాగా చెప్పారు. ప్రతీ ఒక్కరికి ఉపయోగపడే శిక్షణ ఇది.
– ఇ.సంధ్య, గాలిపెల్లి, సిరిసిల్ల

ఉత్సాహంగా హాజరు



2016 నుంచి టీటీసీసీలో టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నా. ప్రతిరోజు సుమారు 700 మందికి పైగా హాజరవుతున్నారు. ప్రస్తుతం కరీంనగర్ డాక్టర్ స్ట్రీట్‌లోని బాలికల పాఠశాలలో పని చేస్తున్నా. శిక్షణ కోర్సుల్లో చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చాలామందికి ఉపయోగపడే కోర్సు ఇది. ప్రతి సంవత్సరం శిక్షణకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుండడం విశేషం.
– కె.సుజాత, టైలరింగ్ ట్రైనర్

విజయవంతంగా పూర్తి



కరీంనర్ వేదికగా 42 రోజులపాటు విజయవంతంగా కోర్సు జరిగింది. పెద్ద సంఖ్యలో పురుషులు, మహిళలు హాజరయ్యారు. కోర్సులో భాగంగా పలువురు మహిళలు అద్భుతాలను సృష్టించేవిధంగా వస్తువులను తయారు చేసి అలరించారు. కోర్సు చేసిన పాఠశాల వాతవరణాన్ని పూర్తిగా మార్చేశారు. సొంతంగా పాఠశాల గోడలకు అద్భుతమైన చిత్రాలను వేశారు. ఎందరికో ఉపాధినిచ్చే ఇలాంటి కోర్సులను ప్రతీ ఒక్కరు పూర్తి చేయాలి.
– బొట్ల రామస్వామి, కోర్సు డైరెక్టర్

అడగండి... అడుగేయండి


బడిలోకి వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే ముందు తల్లిదండ్రులు ఆచితూచీ అడుగేయాల్సిన అవసరం ఉంది. ఆ స్కూల్ ఎలాంటిది? గతంలో స్కూల్ విద్యార్థులు సాధించిన ఫలితాలు ఎలా ఉన్నాయి? ఫీజుల వివరాలు, తల్లిదండ్రులతో యాజమాన్యం ఎలా వ్యవహరిస్తుంది? అనే వివరాలు గమనించాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది పాఠశాలే కాబట్టి.. ఆలోచించి అడుగేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. జిల్లాలో 120 గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. నేటి నుంచి పాఠశాలలు పునర్‌ప్రారంభం కానుండడంతో ఇప్పటికే జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. హంగు ఆర్భాటాలతో విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉపాధ్యాయులను ఇళ్లకు పంపిస్తూ పిల్లలను తమ బడిలో చేర్పించాలని కోరుతున్నారు.

అనుమతులు ఉన్నాయా..

ప్రైవేటు పాఠశాల తమ వివరాలను విద్యాశాఖ కార్యాలయంలో నమోదు చేసుకొని ఉంటుంది. వారికి నిర్దిష్ట సంఖ్య, నమోదైన సంవత్సరంతో కూడిన పత్రాన్ని ఇస్తారు. దీన్ని పరిశీలించాకే తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాలి. కొన్ని పాఠశాలలు 1–7, 8–10 తరగతుల వరకు నిర్వహిస్తారు. ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది.

నోటీస్ బోర్డుపై ఇవి ఉన్నాయా..

మీరు చేర్పించబోయే ప్రైవేటు పాఠశాలలోని బోధన సిబ్బంది అర్హతలు ఎలా ఉన్నాయో గమనించాలి. అర్హత గల ఉపాధ్యాయులు ఉన్నారా? అనేది ఆరా తీయాలి. బీఈడీ, డీఈడీ వంటి విద్యార్హతలు గల వారితో విద్యాబోధన చేస్తున్నారో.. లేదో తెలుసుకోవాలి. ఉపాధ్యాయుల వివరాలు, అర్హతలను ప్రభుత్వ పాఠశాలలో మాదిరిగా ప్రైవేటు పాఠశాల నోటీస్ బోర్డుపై ప్రదర్శించారో.. లేదో చూడాలి. ఫీజుల వివరాలు ఎలా ఉన్నాయి? ఫీజుల్లో పారదర్శకత ఉందా.. అడిగి తెలుసుకోవాలి.

వసతులపై దృష్టి పెట్టండి

మెరుగైన ఫలితాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో.. లేదో తెలుసుకోవాలి. ప్రాథమిక స్థాయి నుంచి పఠనాసక్తి కలిగించే ఎలాంటి అంశాలు అమలు చేస్తున్నారో అడగాలి. స్కూల్‌లో లైబ్రరీ, ప్లేగ్రౌండ్, టాయిలెట్స్.. తాగునీటి వసతుల గురించి తెలుసుకోవాలి.

ఇన్నోవేటీవ్ అంశాలపై..

పాఠశాలలో ఇన్నోవేటివ్ అంశాలు నేర్పిస్తున్నారా.. కొత్త విషయాలను విద్యార్థులకు తెలిసేలా తరగతులు నిర్వహిస్తున్నారా.. తెలుసుకోవాలి. గతంలో వైజ్ఞానిక ప్రదర్శనలు.. ఇన్‌స్పైర్ మానక్, సైన్స్‌మేళాల్లో భాగస్వామ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని, ప్రతిభ చాటే వారిని ఎలా ప్రోత్సాహం ఎలా ఉందో ఆరా తీయాలి. అలాంటి పాఠశాలలను తల్లిదండ్రులు ఎంపిక చేసుకోవాలి.